
జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలి

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ములుగు జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి వీరమళ్ల కేశవరావు పిలుపునిచ్చారు. గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో సోమవారం భాజపా నాయకులు మేరుగు సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సభ్యత్వ నమోదులో స్థానిక నాయకులు, కార్యకర్తలు విశేష కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. భాజపా అంతర్జాతీయంగా సాధిస్తున్న విజయాలను క్షేత్రస్థాయిలో వివరించాలని కోరారు. కార్యక్రమంలో ములుగు అసెంబ్లీ కన్వీనర్ జాడి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు వై.రవీందర్‌రెడ్డి, నాయకులు ఎం.సతీశ్, కె.మార్కండేయ, పి.బాబురావు పాల్గొన్నారు.


పస్రాలో భాజపా సభ్యత్వాన్ని అందజేస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేశవరావు

అరచేతిలో ఓటరు జాబితా

ములుగు టౌన్, దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పలువురు తమ ఓటు వేయడానికి వెళ్తే పేరు లేక వెనుదిరిగిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో పౌరులందరూ తమ హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకుంటుంది. తాజాగా తమ పేరు జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవడానికి మరో ఆధునిక వేదికను అందుబాటులోకి తెచ్చింది. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శనగా పెట్టే ఓటర్ల జాబితాలో పేరు చూసేంత వీలు లేకపోవడంతో తమ తమ చరవాణి, ఇతర గ్రాహకాల్లో చూసుకునేందుకు అంతర్జాల వేదికను అందుబాటులోకి తెచ్చింది.



వివరాలు తెలుసుకోవచ్చు ఇలా..

ఆధునిక హంగులున్న ఫోన్‌లో గూగుల్‌లో అంతర్జాలం అనుసంధించి TSEC.gov.in అని ఆంగ్లంలో నమోదు చేస్తే వెబ్‌సైట్ కనిపిస్తుంది. అందులో ఎలక్ట్రోరల్ రోల్ అనే ఆప్షన్ వద్ద ప్రవేశ మీట నొక్కితే 2024 ఓటర్ల జాబితా పుట ఉంటుంది. అందులో జిల్లా, శాసనసభ నియోజకవర్గం, గ్రామం పేరు మీద క్లిక్ చేయాలి. వెంటనే నాలుగంకెల సంఖ్య వస్తుంది. అది నమోదు చేస్తే జాబితాలో వరుస సంఖ్య సహా సమస్త వివరాలు కనిపిస్తాయి.

- త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటూ ప్రభావం చూపుతుందనే నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నేడు మేడారంలో మొక్క ముడుపు పండగ

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని మేడారంలో యువకులు, పూజారులు వినూత్నంగా మొక్క ముడుపు పండగకు శ్రీకారం చుట్టారు. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల కారణంగా మేడారంలో కాలుష్యం పెరుగుతుందని, దీనిపై దృష్టిసారించిన యువకులు మొక్క ముడుపు పండగకు శ్రీకారం చుట్టారు. దేవతల దర్శనానికి వచ్చే భక్తులందరూ నార్లాపురం చింతల్ క్రాస్ వద్ద ఆగి అక్కడ ఒక మొక్క నాటాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం యువకులు, పూజారులందరూ కలిసి మొక్కలు నాటి వనభోజనాలు చేయనున్నారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, యువజన సంఘం సమన్వయకర్త ఆలం సుధీర్ కోరారు.

సామాజిక భద్రతా పథకాలపై అవగాహన అవసరం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సామాజిక భద్రతా పథకాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ స్వప్న అన్నారు. గోవిందరావుపేట మండలం సోమలగడ్డ గ్రామంలో సోమవారం ఆమె గ్రామస్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు సామాజిక భద్రత అవసరంపై వివరించారు. ప్రతి గ్రామంలో ఈ పథకం కింద 100 శాతం నమోదు అయ్యేందుకు తమ సంస్థ కృషి చేసుందని, అందుకు ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని కుటుంబ సభ్యులకు భద్రత కల్పించుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, వీఓ అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి అరుణ, కోశాధికారి సరిత, వీఓఏ సుమలత, మాజీ సర్పంచి ఏలేంద్ర, సంస్థ ప్రతినిధి చందూ తదితరులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు..!


కమలాపురం బిల్టు కర్మాగారం (పాతచిత్రం)

పూర్వ వైభవం

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, మంగపేట(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: బిల్టు కర్మాగారం తిరిగి తెరుచుకుంటుందని పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు కార్మికులు. ఎన్సీఎల్టీ (నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్) తీర్పుతో వారి ఆశలు అడియాశలయ్యాయి. బిల్టు మరో సంస్థ ఆధీనంలోకి వెళ్లింది. దాదాపు ఈ ప్రాంతంలో మరో పరిశ్రమ ఏర్పాటు కావడమే కష్టం అనుకున్న తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇక్కడి వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. బిల్టు స్థానంలో పేపర్ బోర్డు మిల్లు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

2014 ఏప్రిల్ 3న పరిశ్రమలో యాజమాన్యం ఉత్పత్తి నిలిపివేసింది. గతంలో ఇక్కడ 780 మంది శాశ్వత కార్మికులు, వెయ్యి మంది పొరుగు సేవల పద్ధతిలో, 350 మంది మేనేజ్‌మెంట్ సిబ్బంది, మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి కలగడంతో.. ఈ ప్రాంతం ఓ వెలుగు వెలిగింది. మేనేజ్‌మెంట్ పునరుద్ధరణకు ముందుకు రాకపోవడంతో ఎన్సీఎల్టీ ద్వారా చివరకు ఫిన్‌కెస్ట్ సంస్థ ఈ పరిశ్రమను దక్కించుకుంది. తాజాగా ప్రభుత్వ నిర్ణయం, ఐటీసీ ఆసక్తి చూపడంతో మళ్లీ ఈ ప్రాంతానికి పూర్వ వైభవం వస్తుందని కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పేపర్ బోర్డు మిల్లు ఏర్పాటుకు దరఖాస్తు

రాష్ట్రంలో కొత్తగా భారీ పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. పరిశ్రమలు స్థాపించే సంస్థలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ఆసక్తి ఉన్న సంస్థల నుంచి దరఖాస్తులు కోరింది. దీంతో పలు సంస్థలు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని దరఖాస్తులు చేసుకున్నాయి. ఆయా సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురంలో మూతబడిన బిల్టు కాగితం మిల్లు స్థానంలో 2.50 లక్షల టన్నుల సామర్థ్యంతో పేపర్ బోర్డు మిల్లు ఏర్పాటు చేయాలని ఐటీసీ సంస్థ ప్రతిపాదన చేస్తోంది. దాదాపు రూ.4 వేల కోట్లతో దీనిని స్థాపించేందుకు ముందుకొస్తోంది. 230 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రతిపాదించింది.

ఐటీసీ ఆసక్తి..

బిల్టు గ్రూపులోని యమునా నగర్, ఒడిశా చౌద్వార్, కమలాపూర్(బిల్ట్).. ఈ మూడు ఖాయిలా పడ్డ కంపెనీలను రూ.740 కోట్లకు ఫిన్‌కెస్ట్ సంస్థ దక్కించుకుంది. అందులోని సామగ్రి పనిరాకుండా ఉందని నిర్మాణాలను తొలగించి సామగ్రిని తుక్కు కింద విక్రయించారు. రెవెన్యూ అధికారులు కూడా స్థలం లెక్కగట్టారు. దాదాపు 686 ఎకరాలున్నట్లు గుర్తించారు. భద్రాచలంలో ఐటీసీకి పేపర్ మిల్లు ఉంది. కమలాపురంలో మరోదానికి ఆసక్తి చూపుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తే.. ఫిన్‌కెస్ట్‌తో ఒప్పందాలు చేసుకుని పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. మంత్రి సీతక్క ఈ ప్రాంతంలో కర్మాగారం ఏర్పాటు చేస్తే ఇక్కడి వారికి మేలు కలుగుతుందని భావిస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్, మంత్రి బిల్టును పరిశీలించారు.

కార్మికుల ఆశలు

పరిశ్రమ మూసివేతతో కార్మికుల జీవితాలు చీకటిమయమయ్యాయి. పదేళ్ల పాటు సర్వీసు కోల్పోయారు. వారికొచ్చే ప్రయోజనాల్లో అన్యాయం జరిగింది. నూతన పరిశ్రమ ఏర్పాటు చేస్తే తమకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదిస్తే కర్మాగార ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

ప్రయోజనాల్లో తీవ్ర అన్యాయం - రాంచందర్, బిల్టు ఐకాస నాయకుడు



కొత్త కంపెనీ ప్రారంభిస్తే పాత వారికి అవకాశం ఇవ్వాలి. కార్మికులకు రావాల్సిన ప్రయోజనాల్లో తీవ్ర అన్యాయం జరిగింది. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. మిల్లు ఏర్పాటు చేసే సంస్థ కార్మికులకు న్యాయం చేసేలా ప్రతిపాదనలతో రావాలి.

కార్మికులకు న్యాయం చేయాలి

- రవిమూర్తి, బిల్టు ఐకాస నాయకుడు



ఎన్సీఎల్టీ తీర్పులోనూ అన్యాయమే జరిగింది. 2015 నుంచి వేతనాలు కోల్పోయాం. ఏదైనా కంపెనీ తిరిగి ప్రారంభిస్తే మా కార్మికులకే అవకాశం కల్పించాలి. ప్రభుత్వం ముందుకొచ్చి మాకు న్యాయం చేయాలి.

స్కందమాత.. అభయ ప్రదాత


స్కందమాత అలంకరణలో శుభానంద

కాళేశ్వర క్షేత్రంలోని అనుబంధ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అయిదో రోజు శ్రీశుభానందదేవీ, సరస్వతీదేవీలు స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, కాళేశ్వరం

'కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత భారాస, భాజపాకు లేదు'

ములుగు, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత భారాస, భాజపాలకు లేదని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ అన్నారు. సోమవారం ములుగు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో ఏ ఒక్క రైతుకు కూడా రుణమాఫీ చేయని రాజకీయ పార్టీలు కాంగ్రెస్ గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రూ.లక్ష రుణమాఫీ కోసం అవస్థలు పడిన భారాస, ఎనిమిది నెలల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. పారిశ్రామిక వేత్తలకు రూ.14 లక్షల కోట్లు మాఫీ చేసిన భాజపా ప్రభుత్వం దేశానికి అన్నం పెట్టే రైతన్నను పట్టించుకోలేదన్నారు. రూ.2 వేల పీఎం కిసాన్ పథకం ఎంత మంది రైతులకు అందుతుందో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, కంబాల రవి, నూనేటి శ్యాం, వాకిటి రామకృష్ణా రెడ్డి, పల్లె జయపాల్ రెడ్డి, నల్లెల భరత్, బండి శ్రీనివాస్, చింతనిప్పుల భిక్షపతి, మట్టెవాడ తిరుపతి, బాదం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

స్తంభం ముప్పు.. కలగాలి కనువిప్పు..!



వెంకటాపురం మండల కేంద్రంలోని ఎస్సీ మర్రిగూడెం గ్రామంలో నడిరోడ్డుపై విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. కొన్నేళ్ల కిందట ఇక్కడ కరెంటు సరఫరాకు ఇక్కడ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమీపంలోనే చేతిబావి ఉండటం, నాలుగు రోడ్ల కూడలి కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గాన్ని సిమెంట్ రహదారిగా మార్చేందుకు పూర్వపు రోడ్డు తొలగించే పనులు కొనసాగుతున్నాయి. విద్యుత్తు శాఖ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి స్తంభాన్ని మరోచోటికి మార్చితే అపాయం తప్పనుంది. – న్యూస్‌టుడే, వెంకటాపురం

చెక్‌డ్యాం నిర్మిస్తే 20 గ్రామాలకు సాగునీరు


అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం బొగ్గుల వాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం రాత్రి ములుగు మండలం కన్నాయిగూడెంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బొగ్గుల వాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే సుమారు 20 గ్రామాలకు సాగు నీరందే అవకాశం ఉందన్నారు. వాగుకు అవతలి వైపు ఉన్న గ్రామాలకు సాగు నీటి వసతితో పాటు రహదారి ఏర్పడుతుందని తెలిపారు. చెక్ డ్యాం సాధించే వరకు సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామ శాఖ కార్యదర్శి వాసం రమేష్, సహాయ కార్యదర్శి సారంగపాణి, సభ్యులు నీలక్క, పాపయ్య, బాబు, లక్ష్మయ్య, స్వామి, సాంబయ్య, రవి, రఘు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీ.. ఛార్జింగ్ కేంద్రాలేవీ?

● ఓరుగల్లులో పెరుగుతున్న విద్యుత్తు వాహనాలు

> ప్రయివేటు కంపెనీలు ఏర్పాటుచేసిన రెండు మూడు చిన్న ఛార్జింగ్ పాయింట్లు మాత్రమే వరంగల్ ప్రాంతంలో ఉన్నాయి.

'మూడేళ్ల కిందట తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో) నగరంలో పది ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు సర్వే చేపట్టింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.'




ఈనాడు, వరంగల్, రంగశాయిపేట, న్యూస్‌టుడే

రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు, ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వాలు విద్యుత్తు వాహనాలను (ఈవీ) ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఈ వాహనాలను విక్రయించే షోరూంల సంఖ్య పెరుగుతోంది. ఈ- కార్లు, విద్యుత్తు ఆటోలు, ఇతర పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కోసం నగరంలో సరిపడా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం పెద్ద లోటు. హైదరాబాద్ పరిధిలో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన రెడ్కో ఓరుగల్లులో పెట్టకపోవడంతో సుదూరాల నుంచి నగరానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

నిట్ సాంకేతిక అండ

నగరంలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ పూర్తి సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. రెండేళ్ల కిందట 'ఆప్టిమల్ లొకేషన్ ఆఫ్ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ వరంగల్' అనే పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పెర్లి సురేశ్‌బాబు నేతృత్వంలో దీన్ని పూర్తి చేశారు. నగరంలో వాహనాల రద్దీ దృష్ట్యా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఎక్కడెక్కడ వస్తే బాగుంటుంది.. సబ్‌స్టేషన్ల నుంచి ఏ మేరకు విద్యుత్తు అవసరం ఉంటుందని లోతుగా అధ్యయనం చేసి పరిశోధన పత్రం రాస్తే అది స్విట్జర్లాండ్ జర్నల్‌లో ప్రచురితమైంది. నగరంలో 39 కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆ ప్రాజెక్టు ద్వారా గుర్తించారు.



ఈవీ ఛార్జింగ్ స్టేషన్లపై నిట్ రూపొందించిన ప్రాజెక్టు

స్టేషన్ల ఏర్పాటు ఎంతో అవసరం


వరంగల్‌లో ప్రయివేటు ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్

వాహనాల్లో పెట్రోలు, డీజిల్ వేయించుకోవడం సులువు. రెండు మూడు నిమిషాల్లో పూర్తవుతుంది. అదే విద్యుత్తు ఛార్జింగ్‌కు చాలా సమయం పడుతుంది. గంటల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్టేషన్లు ఉంటే కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి సౌకర్యం ఉంటాయి. వీటిని ప్రభుత్వం ఏర్పాటుచేస్తే విద్యుత్తు ధరలు కూడా తక్కువగా ఉంటాయి.

- నగర వాసులు డీజిల్, పెట్రోల్ నుంచి ఎల్పీజీ, సీఎన్‌జీకి. . ఇప్పుడు క్రమంగా ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. 2022లో హనుమకొండ జిల్లాలో ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు 375 రిజిస్ట్రేషన్ కాగా.. గతేడాది 736, ఈ ఏడాది ఇప్పటికే 950 దాటిపోయాయి. కార్ల కొనుగోలుపై నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల కిందట 15 ఉండగా, గతేడాది 67కు చేరాయి. ఈ ఏడాది ఇప్పటికే 36 దాటిపోయాయి. డిసెంబరుకల్లా వందకు చేరే అవకాశం ఉంది.




విద్యుత్తు ద్విచక్రవాహనం


ఈవీ ఆటో

కార్లకు కష్టమే - శ్రీకాంత్, హనుమకొండ



నాకు ద్విచక్ర విద్యుత్తు వాహనం ఉంది. ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకుంటాను. మా స్నేహితులు హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చినప్పుడు అదనపు బ్యాటరీలు తెచ్చుకుంటున్నారు. లేదా మా ఇంట్లో ఛార్జింగ్ పెట్టడం వల్ల గంటల తరబడి సమయం వృథా అవుతోంది. ఛార్జింగ్ స్టేషన్ ఉంటే కొద్ది సమయం సరిపోతుంది. ఓరుగల్లు నగరంలో ప్రభుత్వం ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

ఆర్టీసీ కూడా మరిచింది

వరంగల్ రీజియన్ ఆర్టీసీ బస్సుల్లో కొన్ని ఈవీలను వినియోగిస్తామని మూడేళ్ల కిందట ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఆర్టీసీ అనేక ఈ బస్సులను తీసుకొచ్చింది. అదే స్ఫూర్తితో మొదటి దఫాలో ఓరుగల్లు నగరంలో 10 విద్యుత్తు బస్సులు తెస్తామని ప్రకటించి.. అంతటితో ఆ ప్రతిపాదన అటకెక్కించింది.

దిల్లీ విధానం భేష్



కేంద్ర ప్రభుత్వం 2030 కల్లా దేశంలో సగానికి సగం విద్యుత్తు వాహనాలనే రహదారులపై తీసుకురావాలనుకుంటోంది. ఈ క్రమంలో దిల్లీ ప్రభుత్వం అక్కడి వాయు కాలుష్యం దృష్ట్యా ఈవీలను బాగా ప్రోత్సహిస్తోంది. 'స్విచ్ దిల్లీ' పేరుతో పాలసీ రూపొందించింది. 30 వేల ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 2,452 ఏర్పాటు చేసింది. ఛార్జింగ్ స్టేషన్లు 1,919 ఉన్నాయి.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు


గుడిసెలను తొలగిస్తున్న అటవీ అధికారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గిరిజనులు వేసుకున్న గుడిసెలను అటవీశాఖాధికారులు తొలగించారు. ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన సుమారు 150 కుటుంబాలు ఆరు నెలలుగా రొయ్యూరు అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి చల్పాక వెళ్లే మార్గంలోని పోడు భూముల్లో గుడిసెలు వేసుకుని అక్కడే ఉంటున్నారు. గతంలో పలుమార్లు తొలగించినా.. మళ్లీ వేసుకుని పిల్లాపాపలతో నివసిస్తున్నారు. అటవీ అధికారులు ఎన్నిసార్లు గుడిసెలు తొలగించి ఇక్కడ ఉండొద్దని చెప్పినా వినడం లేదు. ఈ క్రమంలో సోమవారం ఏటూరునాగారం ఎఫ్‌డీవో రమేష్, రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం, తాడ్వాయి, వెంకటాపురం రేంజ్‌ల అటవీ అధికారులు సుమారు 70 మంది సంబంధిత ప్రదేశానికి జేసీబీ, దోజర్లతో వెళ్లారు. గుడిసెల్లోని సామగ్రిని సైతం వదలకుండా ఒక్కసారిగా మూకుమ్మడి దాడి చేసి గుడిసెలను తొలగించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ సంబంధిత గిరిజనులకు వెన్నుదన్నుగా నిలిచి గుడిసెలు వేయించింది. తుడుందెబ్బ జెండాలను సైతం ఆ గుడిసెల్లోని ఇంటింటికి పాతింది. సంబంధిత జెండాలతో సహా మొత్తం సామగ్రిని అధికారులు బయట పడేశారు. గిరిజనులు ఎంత అడ్డుకున్నా వినకుండా ఆ భూమి అటవీశాఖదంటూ తొలగించారు. అటవీ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని ఈ సందర్భంగా ఎఫ్‌డీవో హెచ్చరించారు.

నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!

● అరుదైన జంతువుల అక్రమ రవాణా

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

ఉమ్మడి వరంగల్ జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు నెలవైన ప్రాంతాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి తీరం వెంట దట్టమైన, పచ్చని అడవుల్లో జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. వేటగాళ్లతో వాటికి ముప్పు వాటిల్లుతోంది.. గుట్టుగా వేటాడి వన్యప్రాణుల చర్మాలు, గోళ్లు, మాంసంతో వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వేట మాత్రం ఆగడం లేదు.. గత శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన జంతువులను ఏకంగా ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. నూతన పంథాలో దుండగులు పాంగోలిన్(అలుగు)ను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

చెన్నై బ్యూరో సభ్యులు మాటేసి..

ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా.. స్థానిక అధికారులు ఈ విషయాన్ని పసిగట్టలేదు. వాట్సాప్ గ్రూపును చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొను గోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ల ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ చేరుకున్నారు. దుండగులు చెప్పినట్లుగా భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వచ్చారు. మాటు వేసి అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు..

పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు.. ఇలాంటి నెట్‌వర్క్‌తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్తుగొల్పుతోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

మరో 8 మంది గుర్తింపు..

అలుగు విక్రయంలో ముందుగా ముగ్గురిని పట్టుకున్నారు. అయితే దీని వెనుక తతంగం నడుపుతున్న 8 మందిని గుర్తించారు. కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన వారుండటం గమనార్హం. అందులో ఓ రాజకీయ నేత కూడా ఉన్నాడు. ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకుంటే ఈ దందా పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందినవారు ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

అరుదైన జంతు విక్రయాల ముఠాలు..

అంతరించిపోతున్న జంతువును వేటాడేందుకు ముఠాలు తిరుగుతుంటాయి. అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలుగును ఒకరు రూ.30 వేలకు కొన్నట్లు సమాచారం. వాటి పొలుసులకు డిమాండ్ ఉంటుందనేది ప్రచారంలో ఉంది. ఇది చేతులు మారుతూ రూ.3 లక్షల ధర పలికినట్లు తెలిసింది. అరుదైన జంతువులకు ధరలు ఊహించుకుని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

రాత్రిళ్లే ఎక్కువగా వేట సాగుతోంది. రాత్రిళ్ల అటవీ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. వేటగాళ్ల ఆయుధాలతో ఉంటారు. ఇది అధికారులకు సమస్యగా మారింది. వారికి కూడా రక్షణ కరవైంది. తగిన చర్యలు తీసుకుని ఇప్పటికైనా వేటను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఉచ్చులు.. విద్యుదాఘాతం

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘతంతో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

వేటను అరికడుతున్నాం..

-వసంత, డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి

వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రి పూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్యప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

హాని తలపెడితే శిక్ష తప్పదు..

- వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా.. భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.
- పులి, అలుగు, ఇతర షెడ్యూల్-1లో పరిధిలోని ప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదవుతుంది. 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా పడుతుంది.
- రెండోసారి కూడా అదే తప్పుచేస్తే రూ.25 వేల జరిమానా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష.
- పులి ఉండే అభయారణ్యంలోని కోర్ ఏరియాల్లో వేటాడితే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుంది.
- రెండు అంతకంటే ఎక్కువసార్లు వేటాడితే రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- పులిని వేటాడినట్లు సరైన ఆధారాలుంటే నిందితులను వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు..

లలితా మహా త్రిపురసుందరి దేవిగా భద్రకాళి





పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదోరోజు సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారు లలితా మహా త్రిపురసుందరి(రాజరాజేశ్వరి)గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ, సాయంత్రం శేష వాహన సేవ జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు లలితా మహాయాగంలో పాల్గొన్నారు. 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

'బోధనా రుసుం విడుదలైతేనే కళాశాలలు తెరుస్తాం'



రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమన్యాల సంఘ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు దసరా తరువాత నిరవధికంగా మూసివేస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘ బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల నుంచి యాజమాన్యాలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల జాప్యం కారణంగా, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనాల విడుదలలో ఆలస్యం కారణంగా అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామన్నారు. పది నెలలుగా ముఖ్యమంత్రికి, వివిధ శాఖల మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా, నేటివరకు ఎలాంటి పరిష్కార నిర్ణయం వెలువడలేదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధన

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ నెల ఒకటి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరంగల్ డీసీసీబీ, రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు దీటుగా వరంగల్ డీసీసీబీ ఉత్తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని బ్యాంకు కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, సీఈవో, అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. తొలుత బ్యాంకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినందుకు ఆయన కేకు కోసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్‌కు తినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడుతూ తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.12 వందల కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. ఈ ఘనత సాధనలో తోడ్పడిన సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు, సీఈవోలు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ పొందిన బ్యాంకు పరిధిలోని రైతులందరికీ వెంటనే కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్లకు సూచించారు. రుణమాఫీకి అర్హతగల రైతుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై జిల్లా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇంకా డీసీసీబీ జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజునాయక్, ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్ జంప్

-న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌలి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అండర్-20 బాలికల 800 మీటర్ల పరుగులో విజేతలు



60 మీటర్ల పరుగు పందెం..

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట, న్యూస్‌టుడే : పక్షం రోజులుగా రద్దయిన రైళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్- హసన్‌పర్తి రోడ్ మధ్య నాలుగో లైను పనుల కారణంగా సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు కాజీపేట- బల్లార్షా, వరంగల్- బల్లార్షా మార్గంలో నడిచే దాదాపు అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. దూర ప్రాంత రైళ్లను మాత్రం నడిపించారు. రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, ఇంటర్‌సిటీ, సింగరేణిలు 8వ తేదీన, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 9వ తేదీ నుంచి ప్రారంభమౌతాయి. పండగ వేళ రద్దు కావడంలో ప్రయాణికులు ఇప్పటికే ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు చేశారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే చాలా మంది రిజర్వేషన్లు చేసుకున్నారు. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీలో వెయిటింగ్ లిస్టు ఎక్కువగా ఉంది.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు శిక్ష

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో చొరబడి.. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లిన నలుగురు దోపిడీ దొంగలకు ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ.. హనుమకొండ జిల్లా ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి క్షమాదేశ్‌పాండే సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అలవాల సమ్మయ్య 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన షేక్ అలీ హైదర్, కుమారస్వామి, శంకర్, మధుకర్, కోరుట్లకు చెందిన శివకృష్ణ, మహ్మద్ అసీఫ్ ఒక ముఠాగా ఏర్పడి.. హనుమకొండలోని గణేశ్‌నగర్‌కు వచ్చారు. అలవాల సమ్మయ్య భార్య ఒంటరిగా ఇంట్లో ఉండటాన్ని గమనించారు. బయట ఒకరు కాపలా ఉండి.. మిగతావారు ఇంట్లో చొరబడి ఆమెను బంధించారు. విలువైన వస్తువులు మూటగడుతుండగా.. అదే సమయంలో బయటకు వెళ్లిన సమ్మయ్య ఇంటికి వచ్చారు. బయట ఉన్న వ్యక్తిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా.. అతడు సమ్మయ్యను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించాడు. అనంతరం ఆభరణాలు, నగదు, చరవాణులతో ఉడాయించారు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా శిక్ష విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ వాదించారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సుభాష్ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.

నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళి శాఖ ఏడీ రాఘవరావు తెలిపారు. ప్రదర్శనలో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే చేనేత సహకార సంఘాలు, సంస్థలు ఎలాంటి రుసుం లేకుండా అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్ షీట్లు, లుంగీలు, టవళ్లు, పత్రంజిలు, కార్పెట్లు తదితరాలు విక్రయిస్తారని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటున్నట్లు రాఘవరావు తెలిపారు.

రసం పీల్చే.. పురుగుల పనిపడదాం..!



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్యపంటగా ఉంది. పూత, కాతగా దశలో ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగులు ఉద్ధృతి పెరుగుతున్న పరిస్థితిని గమనించామని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, పంట ఉత్పత్తి విభాగ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు. సస్యరక్షణ చర్యలను 'రైతేరాజు'కు వివరించారు.

-న్యూస్‌టుడే, మానుకోట

పేనుబంక : లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చుతాయి. ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామరపురుగు : తల్లిపిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులో ఉండి రసం పీల్చుతాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. నివారణకు.. మోనోక్రొటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్పీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటర్ నీటికి లేదా డైఫెన్ థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైనోటోరం 0.9 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి : చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లిపురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత గల వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు ప్రొపెనోఫాస్ 50 ఈసీ లేదా మిథైల్‌పారాథియాన్ 50 ఈసీ ఎసిపేట్ 2 గ్రాములు+ట్రైటాన్ లేదా సాండొవిట్ లాంటి జిగురు మందులు ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగుభాగాన పిల్ల, తల్లి పురుగులు చేరి రసం పీల్చడం ద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులో మారుతాయి. నివారణకు.. ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లోనికామైడ్ లేదా ఫిప్రొనిల్ లీటరు నీటికి రెండు మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫెట్ 75 ఎస్పీ ఒకటిన్నర గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : పిందె, కాయ దశలో ఆశిస్తుంది. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూ మొగ్గలు, కాయలు రాలిపోతాయి. నివారణకు డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమెసిసిన్ ఒక మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.76 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



మిరపనారు

రైతేరాజు

కొంటున్నారా.. జాగ్రత్త సుమా!

మానుకోట, న్యూస్‌టుడే : మిరపనారు కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల తెలిపారు. ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే మిరప నారును కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చే మిరపనారు కొనుగోలును ఎలాంటి ధ్రువీకరణ, బిల్లులు లేకుండా కొనుగోలు చేయవద్దు. పేరొందిన కంపెనీలు, రకాల నారును వ్యవసాయ, ఉద్యాన శాఖలచే ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ విషయంలో సందేహాలు ఉంటే రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను సంప్రదించాలని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? యాసంగిలో కంది, పెసర సాగు చేసేందుకు అనువైన రకాలు, అవసరమైన విత్తనం.. ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చో తెలపండి..? – మారపల్లి రామచంద్రారెడ్డి, హసన్‌పర్తి.



✔ యాసంగిలో పెసరను అక్టోబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ 295, ఎంజీజీ 397(మధిర), ఎంజీజీ 378(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), డబ్ల్యూజీజీ 37 (ఏకశిల), డబ్ల్యూజీజీ 72(యాదాద్రి) రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కందిని అక్టోబర్ 15 వరకు ఏక పంటగా, వేరుసెనగతో మిశ్రమంగా సాగుచేసుకోవచ్చు. కందిలో డబ్ల్యూఆర్‌జీ 53, టీడీఆర్‌జీ 4, ఆర్‌జీటీ1, పీఆర్‌జీ 158, ఎంఆర్‌జీ 41, పీఆర్‌జీ 158 ఎంజీఆర్‌జీ 1004 రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

-కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే



రైతు రవీందర్



సర్వి చెట్లు.. ఆదాయానికి మెట్లు

న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా) : తక్కువ పెట్టుబడితో సర్వి మొక్కల పెంపకం చేపడితే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామానికి చెందిన రైతు రవీందర్.. ఎకరానికి మూడేళ్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని 'రైతేరాజు'కు వివరించారు. 'భాగిర్థిపేటలో రెండెకరాలు, కొత్తపల్లిలో మరో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమిలో రెండేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఓ మిత్రుడి సూచనతో అంతర్గత పంటగా సర్వి మొక్కల పెంపకం చేపట్టాను. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు నుంచి రూ.2.40 పైసలకో మొక్క చొప్పున సుమారు 3600 మొక్కలు కొనుగోలు చేశాను. ఐదుగురు కూలీల సాయంతో రెండెకరాల్లో 19 నెలల కింద మొక్కలను నాటాను. 30 నుంచి 36 నెలలకు మొక్కలు కటింగ్ దశకు చేరుతాయి. ఒక్కో టన్నుకు రూ.5600 నుంచి రూ.6600 వరకు ధర ఉంటుందని కంపెనీ వారు చెప్పారు. ఎకరానికి సుమారు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రెండెకరాల్లో సుమారు 120 నుంచి 140 టన్నుల వరకు కలప వస్తే, టన్నుకు రూ.5600 ధర ఉన్నా ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీ(పేపర్ మిల్లు) వారే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. మొక్కలు, కూలీల, కలుపు మందులు రూపేణా ఇప్పటివరకు కేవలం రూ.10 వేల మాత్రమే ఖర్చయింది. ఆయిల్‌పామ్ కాత దశకు చేరేసరికి సర్వి మొక్కల పెంపకం పెంపకం అయిపోతుందని' వివరించారు.

కరాటేతో ఆత్మరక్షణ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఆత్మరక్షణకు ఉపయోగపడే విద్య కరాటే అని, కరాటే అభివృద్ధికి కృషి చేయాలని పునకోసి షోటోఖాన్ కరాటే అసోషియేషన్ ఇండియా సంస్థ జిల్లా అధ్యక్షుడు మాస్టర్ అబ్బు అన్నారు. ఏటూరునాగారం పట్టణంలో సోమవారం కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ జిల్లాల కరాటే మాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాస్టర్లంతా ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించాలన్నారు. ప్రభుత్వం బాలికలకు ప్రవేశపెట్టిన సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలను అందించాలని సూచించారు. కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్, కబ్బాక జగదీశ్వర్‌రావు, ఖాజాపాషా తదితరులు హాజరయ్యారు.

బతుకమ్మ చీరల పంపిణీ

మంగపేట, న్యూస్‌టుడే: మండలంలోని నర్సింహసాగర్, మంగపేటలో మహిళా సంఘాల మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చిన బతుకమ్మ చీరలను ఇన్‌ఛార్జి తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, మండల ప్రజా పరిషత్ అధికారి బద్రూనాయక్, మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్ పంపిణీ చేశారు. ఈ రెండు గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేసిన తర్వాత ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ చీరల పంపిణీని నిలిపివేశామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోరునర్సాపురం సహకార సంఘం డైరెక్టర్ నర్రా శ్రీధర్, మంగపేట పంచాయతీ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్పందించి.. పరిష్కరించండి..!


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్. దివాకర అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావులతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. కొన్నింటిని సత్వరమే పరిష్కరించి వెంటనే సాధ్యం కాని వాటిని వివిధ శాఖల అధికారులకు సిఫారసు చేశారు. అర్జీల విషయంలో ఎలాంటి జాప్యం చేయొద్దని సూచించారు. ఆలస్యం జరిగితే కారణాలను ఫిర్యాదుదారుకు వివరించాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 26 దరఖాస్తులు స్వీకరించగా, ఎక్కువగా భూసమస్యలకు సంబంధించినవి వచ్చాయి. డీసీఎస్‌వో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీసీవో సర్దార్‌సింగ్, డీఈవో జి.పాణిని, సీపీవో ప్రకాష్, పౌరసరఫరాల డీఎం రాంపతి, జిల్లా వ్యవసాయాధికారి సురేష్, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వివరాలు

భూ సమస్యలు	13
ఉపాధి	2
ఆసరా పింఛన్లు	4
ఇతర సమస్యలు	4

అధికారుల చుట్టూ తిరుగుతున్నా..

- బూస శాంతి, లింగాపూర్, వెంకటాపూర్



లింగాపూర్ శివారులో 2.26 ఎకరాల భూమి ఉంది. నా పేరున ఉన్న పట్టా భూమిని తన కూతురు మౌనికకు ఇచ్చాను. పట్టాను తన కూతురు పేరున మార్చాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు.

రికార్డుల్లో సర్వే నెంబర్లు లేవు

- కృష్ణార్జున్, మేడారం, తాడ్వాయి



మా నాన్న పేరున 186 సర్వే నెంబరులో 34 గుంటలు, 187 సర్వే నెంబరులో 10 గుంటల భూమి ఉంది. 2021లో మా నాన్న చనిపోయారు. ఆ భూమిని మా అమ్మ పేరున మార్చేందుకు మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేసుకుందామనుకుంటే ధరణిలో ఈ రెండు సర్వే నెంబర్లు చూపించడం లేదు. సర్వే నెంబర్లను గుర్తించి పట్టా మార్చాలి.

వినతులను తక్షణమే పరిష్కరించాలి


అర్జీని స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 12 దరఖాస్తులను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దని, జాప్యానికి తగిన కారణాలను ఫిర్యాదుదారుకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీసీ డీఎం జి.ప్రతాప్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

☛ మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన పాయం సౌమ్య తాడ్వాయి ఏహెచ్‌ఎస్‌లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ పోస్టును ఇప్పించాలని విన్నవించారు.

☛ జనగామ జిల్లాలో గణిత శాస్త్ర సీఆర్‌టీగా పని చేస్తున్న తనను ములుగు జిల్లాకు బదిలీ చేయాలని ములుగు మండలం మదన్‌పల్లి గ్రామానికి చెందిన కొర్ర గవాస్కర్ అర్జీని ఇచ్చారు.

☛ తన పోడు భూమికి హక్కు పత్రాలు ఇప్పించాలని కోరుతూ తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన భూక్యా పూర్ణచందర్ దరఖాస్తు చేశారు.

☛ 2024 మేడారం జాతరలో నిర్వహించిన అనుబంధ దేవాలయాల అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని తాడ్వాయి మండలం బయ్యక్కపేట గ్రామానికి చెందిన సమ్మక్క పూజారి చందా రఘుపతిరావు కోరారు.

☛ చట్టాన్ని అతిక్రమిస్తూ చెరువు శిఖం, ప్రభుత్వ భూములను ఆక్రమించి బహుళ అంతస్థుల భవనాలు నిర్మించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గూడూరు మండల కేంద్రానికి చెందిన భానోతు చందు అర్జీని సమర్పించారు.

☛ తనకు స్వీపర్ ఉద్యోగం ఇప్పించాలనిఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురానికి చెందిన పూనెం నిర్మల విన్నవించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం పట్టణంలోని పలు వీధుల్లో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి రోగాలు వచ్చే అవకాశం ఉంది. **- రాజబాబు, ఏటూరునాగారం**

పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రమాదేవి, పంచాయతీ కార్యదర్శి**

పైపు లైనుకు మరమ్మతులు



వాజేడు, న్యూస్‌టుడే: మొరుమూరు కాలనీలో మంచినీటి పైపులైనుకు ఏర్పడిన లీకేజీకి పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ శాఖ పంచాయతీని సంప్రదించకుండా స్తంభాన్ని వేయడంతో మంచినీటి పైపునకు రంధ్రం ఏర్పడింది. దీంతో తాగునీరంతా వృథాగా పోతోందని మొరుమూరు కాలనీ గ్రామస్థులు 'న్యూస్‌టుడే'కు చెప్పడంతో.. సమస్యను పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు వివరించగా ఆయన స్పందించారు. పంచాయతీ సిబ్బందిని పంపించి సోమవారం మరమ్మతులు చేయించారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం


బస్సు నుంచి దిగి వెళ్తున్న ప్రయాణికులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బ్రేకులు ఫెయిల్ కావడంతో డ్రైవర్ చాకచక్యంగా రోడ్డు పక్కకు నిలపడంతో అపాయం నుంచి బయటపడ్డారు. వెంకటాపురం ప్రయాణికుల ప్రాంగణం నుంచి భద్రాచలం వెళుతున్న బస్సు ఇక్కడి ఎన్టీఆర్ కేంద్రం మూలమలుపు దాటగానే అకస్మాత్తుగా బ్రేకు సమస్య ఏర్పడింది. ఎదురుగా ఇసుక లారీలు, ఇతర వాహనాలు వస్తున్నా.. డ్రైవర్ సైదులు జాగ్రత్తగా వ్యవహరించి బస్సును పక్కన నిలిపివేశారు. బస్సులో సుమారు 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అధ్వానంగా ఉన్న ఈ మార్గంలో మరమ్మతులకు గురైన వాహనాలను ఆర్టీసీ నడుపుతుండటం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలనే భద్రాచలం నుంచి వెంకటాపురం వస్తున్న బస్సు దుమ్ముగూడెం వద్ద బ్రేకుల్ ఫెయిల్ కావడంతోనే ఆగింది. దీంతో ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు తరలించారు.

మోహన్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బద్దం మోహన్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. పస్రా గ్రామంలో సోమవారం గొంది రాజేశ్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. మోహన్‌రెడ్డి తన జీవితకాలంలో అధిక శాతం సమయాన్ని పార్టీ అభివృద్ధికే కేటాయించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితభావంతో పని చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. రైతాంగ ఉద్యమంలో ఆయన పాత్ర మరవలేనిదని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు బి.సాంబశివ, పి.చిట్టిబాబు, టి.ఆదిరెడ్డి, ఎస్.మల్లారెడ్డి, కె.కృష్ణారావు, వి.రాజు, పురుషోత్తం, ఎ.మురళి, ఎ.పోషాలు, వై.ధర్మారెడ్డి, కె.సూర్యనారాయణ, ఎస్.ఆదిరెడ్డి, ఎం.కవిత, కె.రాజేశ్వరీ, ఆర్.సువర్ణ, సులోచన పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులతో ఖాతాదారులకు తిప్పలు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: నెలల తరబడి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా.. ఏటూరునాగారంలోని ఏపీజీవీబీ బ్యాంకు ఖాతాదారులను పట్టించుకోవడం లేదని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు ఎట్టి ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఆయన మాట్లాడారు. సంబంధిత బ్యాంకు ఏటూరునాగారం మండలంలోని కొండాయి, దొడ్ల, దొడ్లకొత్తూరు, మల్యాల, షాపల్లి, చిన్నబోయినపల్లి, శివాపురం, గోగుపల్లి తదితర గ్రామాల ప్రజలకు అధీకృత బ్యాంకు పని చేస్తోందన్నారు. ఖాతాదారులు పంట రుణాలు, ఇతరత్రా పనుల కోసం బ్యాంకుకు వెళితే 15 రోజుల నుంచి రెండు నెలల పాటు తిప్పుకొంటున్నారని తెలిపారు. సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, బ్యాంకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కెట్‌కు దసరా సెలవులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులపాటు దసరా సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం తెలిపారు. ఈ నెల 10న దుర్గాష్టమి, 11న మహర్నవమి, 12న విజయదశమి పండగ సందర్భంగా, 13న మార్కెట్‌కు వారాంతపు సెలవు కావడంతో బంద్ ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత రోజుల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు. ఈ నెల 14 నుంచి మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సరకులు విక్రయించేందుకు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి అధ్యక్షుడు గంట సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు పెద్దబోయిన ఐలయ్యతోపాటు సభ్యులు సంకెపల్లి నారాయణరెడ్డి, చింతకుంట్ల యాదగిరి, మహ్మద్ అయూబ్‌ఖాన్, మధుసూదన్, ఆవుల శ్రీనివాస్, కాకి విజయ, కొట్టం రాము, గుగులోతు వీరన్న, చిదురాల వసంతరావు, వోలం రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ అధికారులు, వ్యాపారులు వారికి స్వాగతం పలికారు. పాలక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారుల సహకారంతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకహోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, రావుల మురళి, బండార వెంకన్న, కదిర సురేందర్, తేరాల వీరభద్రం తదితరులున్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: నిరుపేదలకు భరోసాగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఆశయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ అన్నారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో వైద్యసేవలు పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన చెక్కులను సోమవారం వెంకటాపురంలో పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొండపర్తి సీతాదేవి, నాయకులు శ్రీరాములు రమేశ్, బాలసాని వేణుగోపాల్, గాంధర్ల నాగేశ్వరరావు, పిల్లారిశెట్టి మురళి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబకలహాలతో ఆత్మహత్యాయత్నం

వాజేడు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ మహిళ గోదావరి వంతెన వద్ద ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన మహిళకు కొత్తగూడెం పట్టణానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. కుటుంబంలో చోటు చేసుకుంటున్న కలహాలతో మహిళ విసిగిపోయి పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు సైతం సమస్యను పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. జాతీయ రహదారిలో వెళ్తున్న వాహనదారులు గుర్తించి మహిళను వాజేడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై సదరు మహిళ తల్లిని ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యం వికటించి పోస్టల్ ఉద్యోగిని మృతి


రత్నకుమారి(పాతచిత్రం)

తాడ్వాయి, న్యూస్‌టుడే: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఓ మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని ఊరట్టం పంచాయతీ జంపంగవాయికి చెందిన తపాలాశాఖలో పనిచేసే సహాయ బీపీఎం కుర్రి రత్నకుమారి(46)కి ఆదివారం సాయంత్రం జ్వరం వచ్చింది. దీంతో ఆమెను సమీప గ్రామం నార్లాపురంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. రత్నకుమారిని పరీక్షించిన వైద్యుడు ఆమెకు సెలైన్ పెట్టి అందులో రెండు ఇంజిక్షన్లు కలిపాడు. ఈ క్రమంలో రత్నకుమారి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం మూలంగానే తన తల్లి చనిపోయిందని, అతడిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు జిల్లా వైద్యాధికారి అప్పయ్యకు ఫిర్యాదు చేశాడు.

జ్వరంతో చిన్నారి..


వర్షిత(పాతచిత్రం)

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన ములుగు మండలం పత్తిపల్లిలో గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాటోత్ జయపాల్-కవిత దంపతుల కుమార్తె వర్షిత(8) గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా ములుగు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. జ్వరం తగ్గకపోవడంతో హనుమకొండలోని ఓ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది.

మద్యం కృత్రిమ కొరతపై ఫిర్యాదు

కాటారం, న్యూస్‌టుడే : కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో పలు బ్రాండ్ల మద్యం కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారని మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు ప్రజావాణిలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశాడు. పలు బ్రాండ్ల కృత్రిమ కొరతతో గొలుసు దుకాణాల్లో అధిక ధరలకు కొనాల్సి వస్తోందన్నారు. గొలుసు దుకాణాలను నియంత్రించి, సదరు మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


వెంకటాపురం పట్టణంలో..


బెస్తగూడెం గ్రామంలో..


అబ్బాపురం గ్రామంలో..


మంగపేట మండల కేంద్రంలో..


వాజేడు మండలం ధర్మారంలో

ములుగు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ములుగులోని రామాలయం ప్రాంగణంలో అమ్మవారు చండీదేవి అవతారంలో దర్శనమచ్చారు. మాజీ ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి-సుధీర్ దంపతులు చండీహోమం నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాపురం: పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి, రజకవీధి, మహాలక్ష్మీ ఆలయం వీధి, శివాపురం, శివాలయం సమీప వీధి, పాతమార్కెట్, బెస్తగూడెం, పాత్రాపురంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అర్చకులు పూజలు చేశారు. అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బెస్తగూడెంలో అర్చకులు కొత్తపల్ల శ్రీధరాచార్యులు బృందం ప్రత్యేకంగా పూజలు చేసి హోమం నిర్వహించింది.

మంగపేట: మంగపేట శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు విస్సావజ్జుల నరేష్ శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ కొమరగిరి కేశవరావు, సభ్యులు కొమరగిరి సామ్రాజ్యం, సురేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండలంలోని ధర్మారం గ్రామంలో దుర్గామాత మహాచండీదేవీ అవతారంలో దర్శనమిచ్చింది. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవిని కీర్తిస్తూ.. భజన చేశారు.


గోవిందరావుపేట తారకరామా కాలనీలో..

ములుగు రూరల్: ములుగు మండలం అబ్బాపురం గ్రామంలో హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో హనుమాన్ భక్త మండలి సభ్యులు దాసరి రాజేష్, సురేందర్, ఆరెందుల కుమార్, సుధాకర్, కుమాస్వామి, శంకర్, కుమారయాదవ్, స్వామి, ధనిల్, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ఏటూరునాగారం పట్టణంలోని క్రాస్‌రోడ్డులో హనుమాన్ సత్సంగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకల్లో సీఐ అనుముల శ్రీనివాస్ పాల్గొన్నారు. మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు నరేష్, హరీష్, సురేష్, సంతోష్, పవన్, సాయిమూర్త, అఖిల్, రవీంద్రబాబు, నవీన్, కిరణ్, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గోవిందరావుపేట: గోవిందరావుపేట తారకరామా కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాన్ని పూజారులు మహాచండీదేవీ అవతారంలో అలంకరించారు. కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు.


ములుగులోని రామాలయం ప్రాంగణంలో..


ఏటూరునాగారం క్రాస్ రోడ్డులో..

ధర్మ సమాజ్ మండల కమిటీ ఎంపిక


రాజశేఖర్ మహరాజ్

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ధర్మసమాజ్ పార్టీ ఏటూరునాగారం మండల కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజశేఖర్ మహరాజ్, ఉపాధ్యక్షుడిగా సందీప్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, కోశాధికారి అశోక్, కార్యదర్శులు కుడుముల దీపక్, సీతబోయిన వెంకటేశ్ యాదవ్, సభ్యులుగా శ్రీహరి, తరుణ్, కిషోర్, సీతారామ్, నరేందర్, విజయ్, అజయ్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ ప్రాంతీయ ఇన్‌ఛార్జ్ సుమన్ మహరాజ్, జిల్లా ఇన్‌ఛార్జి తరుణ్‌మహరాజ్ హాజరయ్యారు.

పోలీసుల సూచనలు పాటించాలి

మంగపేట, న్యూస్‌టుడే: మండల ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై టీవీఆర్ సూరి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పండగ సందర్భంగా పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది వారి సొంత గ్రామాలకు, పట్టణాలకు ప్రయాణిస్తుంటారని, ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం మంచిదన్నారు. విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలన్నారు. బీరువా తాళాలు ఇంట్లో ఉంచొద్దన్నారు. ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలని, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానాస్పదంగా తమ వీధుల్లో ఎవరైనా తిరిగినా.. కొత్త వ్యక్తుల కదలికలపై 100 నెంబరుకు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

ఎరువుల నమూనాల సేకరణ



ములుగు, న్యూస్‌టుడే: ఎరువుల్లో నాణ్యతా ప్రమాణాల పరిశీలనలో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ నమూనాలను సేకరిస్తోంది. ఇందులో భాగంగా కాంప్లెక్సు ఎరువులతో పాటు యూరియా తదితర రకాల సేకరణ ప్రస్తుతం జిల్లాలో జరుగుతోంది. ప్రతి ఎరువుల దుకాణం నుంచి కొన్ని నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. సోమవారం ములుగులోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సేకరించిన వాటికి సీలు వేసి ల్యాబ్‌కు పంపించేందుకు సిద్ధం చేశారు.

సంఘం బలోపేతానికి కృషి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిన పద్మశాలి సంఘీయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు సంఘం బలోపేతానికీ కృషి చేస్తానని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయ ట్రస్ట్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాట స్ఫూర్తితో సంఘీయుల సమస్యల పరిష్కారానికి అందరు కలిసి పని చేయాలన్నారు. శివభక్త మార్కండేయ ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడిగా కైరంకొండ వీరన్న, ప్రధాన కార్యదర్శిగా తవుటం శ్రీనివాస్, కోశాధికారిగా వి.రాజేందర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. ఓ నాయకుడిని జిల్లా అధ్యక్షుడిని చేస్తే సంఘానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని అతనికి సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు అనుమాళ్ల వెంకటేశ్వర్లు, చిలుకమారి వెంకటేశ్వర్లు, బొమ్మ వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, కస్తూరి శ్రావణ్, వి.సాగర్, శ్రీనివాస్, శ్రీనివాస్, పుల్లయ్య, వార్డు కౌన్సిలర్ చిట్యాల జనార్దన్ పాల్గొన్నారు.

పల్లెల్లో వైద్య శిబిరాలు



వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలంలోని పలు పల్లెల్లో వైద్య ఆరోగ్యశాఖ బృందాలు సోమవారం పర్యటించారు. వాడగూడెం, మరికాల, నూగూరు, చొక్కాల, తిప్పాపురం, వీరభద్రవరం, ఎదిర, ఆలుబాక, వెంకటాపురం, రాచపల్లి ప్రాంతాల్లో శిబిరాలను నిర్వహించి సేవలందించారు. ఇంటింటి సందర్శన చేసి బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు చేసి పోషకాహారం, చిన్నారులకు తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించారు. జ్వరాలపై సర్వే చేసి పలువురు అనారోగ్య బాధితుల వద్ద రక్త నమూనాలు సేకరించి పరీక్షించారు. సాధారణ జ్వరాలుగా నిర్ధారించి మందులు అందజేశారు. ఈ శిబిరాల్లో వైద్యులు ఆశీశ్, వినయ్, సోహల్, పవన్, స్నేహ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, మనోహర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

మహబూబాబాద్, మరిపెడ, కొత్తగూడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో సోమవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మరిపెడలో కాంగ్రెస్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నరేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తగూడ మండలం గోపాలపురంలోని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ తల్లి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమ్మక్క చిత్రపటానికి పూలమాల వేశారు.